## క్లుప్తంగా

### ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న సీమ సుధాకర్‌రెడ్డి

**డోన్:** పట్టణ శివారులో కర్నూలు వైపు 44వ జాతీయ రహదారి పక్కన నిర్మించిన శిర్డీ సాయి ఆలయానికి భక్తుడు రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ప్యాపిలి మండలం గార్లదిన్నె గ్రామానికి చెందిన కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ సీమ సుధాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఈ విరాళాన్ని అందజేసినట్లు ఆలయ కమిటీ కార్యదర్శి రమణగౌడ్ తెలిపారు. దాత కుటుంబ సభ్యులతో పాటు ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ శ్రీరాములు, కృష్ణయ్య పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

**కోవెలకుంట్ల:** స్థానిక జ్యోతి విద్యానికేతన్ విద్యార్థులు జిల్లాస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సింధూరి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. ఇటీవల నంద్యాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన మహ్మద్ యూనిస్, కిరణ్‌రెడ్డి, మల్లికార్జున, రామ్ చరణ్ అనే విద్యార్థులు సత్తా చాటారన్నారు. వీరు ఈ నెల 12, 13వ తేదీల్లో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. ప్రతిభచాటిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించారు.

### మొక్కలు నాటి సంరక్షించాలి

**బేతంచెర్ల:** ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రామేశ్వర్‌రెడ్డి, శ్రీధర్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల ఆవరణలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. విద్యార్థులకు అడవుల ప్రాముఖ్యత, లాభాలపై అవగాహన కల్పించారు. పారిశ్రామిక వేత్తలు మారుతి కృష్ణ, హుసేన్ రెడ్డి, మధు మోహన్‌రెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

**సంజామల:** ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని ఎంపీడీఓ నాగకుమార్ అన్నారు. గురువారం సంజామలతో పాటు ఆల్వకొండ, రెడ్డిపల్లె, ఎగ్గొని గ్రామాలలో నా భూమి -నా దేశం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. నేల తల్లికి నమస్కారం, వీరులకి వందనం ప్రతిజ్ఞ చేయించారు. ఏపీఓ ప్రకాష్ రావు, సర్పంచ్‌లు ఆనందకుమారి పాల్గొన్నారు.

### నేడు డయల్ యువర్ డీఎం

**డోన్ టౌన్:** డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్ గురువారం తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలను 9959225795 నంబర్‌కు కాల్ చేసి తెలపవచ్చన్నారు.

### క్రీడలతో శారీరక దృఢత్వం

**డోన్ టౌన్:** క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసికఉల్లాసం, ఇతర ప్రాంతాల క్రీడాకారులతో పరిచయాలు పెరుగుతాయని డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో గురువారం పట్టణ సమీపంలోని గురుకుల పాఠశాలలో నిర్వహించిన గరల్స్ అథ్లెటిక్ మీట్ పోటీలను ఆయన ప్రారంభించారు. పోటీల్లో మొత్తం 9 స్కూళ్ల నుంచి బాలికలు పాల్గొని హోరాహోరీగా తలపడ్డారు. ప్రిన్స్‌పాళ్లు గీత, జాస్మిన్, ఆర్డీటీ అధికారి శాంసన్, కోర్డినేటర్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

### సారా విక్రేత అరెస్టు

**డోన్ టౌన్:** మండల పరిధిలోని ఎద్దుపెంట గ్రామానికి చెందిన బోయ గోపాల్ అనే సారా విక్రేతను అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు గురువారం దాడులు చేసి గోపాల్‌ను అదుపులోకి తీసుకోని 14 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

### యజమానికి వాహనం అప్పగింత

**డోన్ టౌన్:** అపహరణకు గురైన మినీ వ్యాన్‌ను అధికారులు పట్టుకుని యజమానికి అప్పగించారు. గత నెల 20న డోన్ ఎంవీఐ క్రాంతికుమార్ వాహనాల తనిఖీ చేపట్టి కర్ణాటక రాష్ట్రానికి చెందిన జీపును ఆపారు. రికార్డులను తనిఖీ చేస్తుండగా డ్రైవర్‌తో సహా మరో వ్యక్తి పారిపోయారు. వాహనాన్ని సీజ్ చేసి స్థానిక ఆర్టీసీ డిపోలో ఉంచి నంబర్‌ను విచారణ చేయగా నకిలీగా తేలింది. చాసీ నెంబర్ ఆధారంగా వాహన అసలైన నంబర్‌ను కనుక్కొని యజమానికి ఫోన్ చేయగా కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన వ్యక్తికి చెందినదిగా తెలిసింది. ఆ వాహనం 2022 ఫిబ్రవరి 5న చోరీకి గురి కాగా 12వ తేదీ గుల్బర్గా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. దీంతో పోలీసు స్టేషన్ నుంచి ఎఫ్ఐఆర్ కాపీతో యజమాని గురువారం డోన్‌కు వచ్చి వాహనం సీజ్ చేసిన అపరాధ రుసుం రూ.11,500 చెల్లించి తీసుకెళ్లారు.

### పైర్లకు జీవం పోసిన వర్షం

**కోవెలకుంట్ల:** స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు మండలాల్లో గురువారం తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకు కురిసిన వర్షం ఖరీఫ్ పంటలకు ఊపిరి పోసింది. సబ్ డివిజన్‌లోని కొలిమిగుండ్ల మండలంలో అత్యధికంగా 12.8 మి.మీ, దొర్నిపాడు మండలంలో 10.4 మి.మీ, సంజామల మండలంలో 10 మి.మీ, అవుకు మండలంలో 1.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు 4 వేల హెక్టార్లలో మినుము, మొక్కజొన్న, పెసర, వేరుశనగ, ఆముదం, పొద్దుతిరుగుడు, తదితర పంటలు సాగు చేశారు. పైర్లు సాగు చేసి రెండు నెలలు కాగా వర్షం కోసం ఎదురు చూస్తున్న తరుణంలో గురువారం కురిసిన వర్షంతో రైతులు ఊరట చెందుతున్నారు.

# నులిపురుగులను నిర్మూలిద్దాం



సిమెంట్‌నగర్‌లో అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఇమ్యునైజేషన్ అధికారి, యాగంటిపల్లెలో విద్యార్థినికి మాత్ర వేస్తున్న మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు

**బేతంచెర్ల:** మండలపరిధిలోని ఆర్ఎస్ రంగాపురం పీహెచ్‌సీ పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ మల్లికార్జున రెడ్డి సందర్శించారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు మింగించే కార్యక్రమాన్ని పర్య వేక్షించారు. నులిపురుగుల వల్ల కలిగే నష్టాలు, వాటి నివారణకు చేతుల శుభ్రత, తదితర విషయాలను వివరించారు. మండలపరిధిలోని గోరుమానుకొండ సమీపాన ఉన్న ఏపీ మోడల్ స్కూల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ గంగుల నాగరాజు, ఏఎన్ఎం శారద బాయి ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు మింగించారు. వైద్యురాలు మౌనిక, హెల్త్ అసిస్టెంట్ రామాంజనేయులు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

**బనగానపల్లెరూరల్:** 0–19 ఏళ్లలోపు ప్రతిఒక్కరూ అల్బెండజోల్ మాత్రను తప్పనిసరిగా తీసుకోవాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు సూచించారు. గురువారం మండలంలోని యాగంటిపల్లె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంపీపీ పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రను పంపిణీ చేశారు. మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ ఈ మాత్రల వల్ల పిల్లల్లో రక్తహీనత నివారించి, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఎంపీహెచ్ఓ వెంకటేశ్వర్లు, ఎంఎల్‌హెచ్‌పీ హరిత తదితరులు పాల్గొన్నారు.

**అవుకు:** అల్బెండజోల్ మాత్రలను వేసుకొని కడపులోని నులి పురుగులను నిర్మూలిద్దామని ఉప్పలపాడు పీహెచ్‌సీ డాక్టర్లు వినోద్ కుమార్, యమున, నవీన్ పిలుపునిచ్చారు. గురువారం అవుకుతో పాటు కొండమనాయుని పల్లె, ఉప్పలపాడు గ్రామాల్లో 1 – 19 సంవత్సరాల మధ్య వయస్సు గల వారికి అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్లు మల్లేశ్వరి,


అవుకులో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

వేణుగోపాల్‌రాజు, కమాల్ సాహెబ్, దానమ్మ, తెరిసమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

**ప్యాపిలి:** ప్యాపిలి, జలదుర్గం పీహెచ్‌సీల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారులు వాణిశ్రీ, నితీశ్ కుమార్, ఇంతియాజ్ ఖాన్, నుస్రత్ ఉ జొహరా ఆధ్వర్యంలో తొలిరోజే 90 శాతం మంది విద్యార్థులకు మాత్రలు వేశారు. వైద్యాధికారులు మాట్లాడుతూ గురువారం అందుబాటులో లేనివారికి ఈ నెల 17 వ తేదీన మాత్రలు వేస్తామన్నారు.

**డోన్ టౌన్:** స్థానిక పాతపేట ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో బుధవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. అనంతరం హెచ్ఎం వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అలాగే 30 వార్డు ప్రాథమిక పాఠశాలలో కౌన్సిలర్ ఆర్ట్ రమణ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు.


కోవెలకుంట్లలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి

**కోవెలకుంట్ల:** నులిపురుగులతో వచ్చే వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి సూచించారు. స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మట్టిలో ఉండే నులిపురుగుల గుడ్లు అపరిశుభ్రమైన చేతుల ద్వారా జీర్ణవ్యవస్థలోకి చేరి జీర్ణకోశ, ఆంత్ర వ్యాధులు కలుగజేస్తాయన్నారు. వీటి నివారణకు ఆరు నెలలకొకసారి 19 సంవత్సరాల్లోపు విద్యార్థులందరూ ఆల్బెండజోల్ మాత్రలను వేసుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, న్యాక్ సమన్వయ కర్త భాస్కర్‌రెడ్డి, మాయలూరు పీహెచ్‌సీ హెల్త్ ఆఫీసర్లు సంజీవకుమార్, లక్ష్మి కుమారి, తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఆర్థిక శాఖ మంత్రి పర్యటన

**ప్యాపిలి:** ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శుక్రవారం ప్యాపిలి మండలం వెంగళాంపల్లికి రానున్నారు. ఎన్‌హెచ్- 44 నుంచి వెంగళాంపల్లికి వరకు రూ.కోటి నిధులతో కొత్తగా నిర్మించిన పంచాయతీ రాజ్ రోడ్డును ఉదయం 9:30 గంటలకు మంత్రి ప్రారంభించనున్నారు. అనంతరం మంత్రి అదే రోడ్డుపై పాదయాత్ర చేస్తారని వైఎస్సార్‌సీపీ వర్గాలు తెలిపాయి.

**నేడు మండల సర్వసభ్య సమావేశం**

**ప్యాపిలి:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

### సొంత ఖర్చుతో రోడ్డు నిర్మాణం


రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

**సంజామల:** మండల పరిధిలోని గిద్దలూరు, రామభద్రుని పల్లె గ్రామాల సమీపంలో వెలసిన జగన్నాథ స్వామి గుడి వద్దకు సొంత ఖర్చుతో రోడ్డు నిర్మాణ పనులను గిద్దలూరు వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తుల రామచంద్రారెడ్డి గురువారం ప్రారంభిచారు. ఆయన మాట్లడుతూ.. కొండమీద ఉన్న జగన్నాథ స్వామి గుడి వద్దకు వెళ్లేందుకు మార్గం సరిగా లేకపోవడంతో భక్తులు, గ్రామాల ప్రజల విజ్ఞప్తి మేరకు సొంత నిధులు రూ.లక్ష వెచ్చించి రోడ్డు పనులను చేపడుతున్నట్లు తెలిపారు.

## అభివృద్ధికి సహకరించండి

**డోన్ టౌన్:** రైల్వే డబుల్ లైన్ నిర్మాణ పనుల్లో ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయం చేస్తామని ఆర్డీఓ వెంకటరెడ్డి అన్నారు. స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. రైల్వే విస్తరణ పనుల్లో భూములు, ఇళ్లు కోల్పోయే వారికి మార్కెట్ విలువను డబుల్ చేసి నష్ట పరిహారం అందిస్తామన్నారు. భూసేకరణ చట్టం అనుసరించి ప్రతి ఒక్కరికీ పరిహారం అందిస్తామని చెప్పారు. తహసీల్దార్ విద్యాసాగర్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొట్రికె హరికిషన్, ఆర్ఐ జాకీర్ అహ్మద్ సిబ్బంది ఉన్నారు.


మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

## దంపతులకు తీవ్రగాయాలు

**డోన్ టౌన్:** పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న మంజీరా బార్ అండ్ రెస్టారెంట్ వద్ద గురువారం ఆటో బైకును ఢీకొనడంతో బైకుపై వెళుతున్న దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. పట్టణంలోని వైఎస్ నగర్‌లో నివాసం ఉంటున్న గిరి, గీత దంపతులు బైకుపై పట్టణంలోని జ్యోతి స్కూల్ వద్దకు వెళ్లి పిల్లలకు భోజనం తినిపించి తిరిగి ఇంటికి వెళుతుండగా ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో గిరికి తీవ్రగాయలు కాగా గీతకు తల, చేతికి బలమైన గాయాలయ్యాయి. గాయపడిన దంపతులను చికిత్సల నిమిత్తం డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.


రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దంపతులు

## వీఐటీలో ఇద్దరికి ఉచితంగా సీటు

**కోవెలకుంట్ల/బనగానపల్లెరూరల్:** బనగానపల్లె నియోజకవర్గానికి చెందిన ఇద్దరు విద్యార్థులకు వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) కళాశాలలో మెరిట్ ఆధారంగా ఉచితంగా సీటు దక్కింది. కోవెలకుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన డి. అమృత ఇంటర్‌లో 973 మార్కులు సాధించి జిల్లాస్థాయి టాపర్‌గా నిలిచింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జిల్లాస్థాయిలో మొదటి స్థానం దక్కించుకోవడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో జిల్లాస్థాయి నగదు అవార్డు దక్కించుకుంది. కాగా అమరావతిలోని వేలూరు ఇన్స్టూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్) ఇంజినీరింగ్ కళాశాలలో ఉచిత సీటుకు ఎంపికైంది. ఈ మేరకు విద్యార్థినిని ప్రిన్సిపాల్ మద్దిలేటిస్వామితో పాటు అధ్యాపకులు రామలింగారెడ్డి, వెంకటశివుడు, విజయరావు, తదితరులు అభినందించారు. అలాగే బనగానపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2022–23 విద్యా సంవత్సరంలో ఇంటర్ ఎంపీసీ గ్రూప్‌లో 955/ 1000 మార్కులు సాధించిన టి. నవీన్‌కు కూడా వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో మెరిట్‌పై ఉచిత సీటు వచ్చింది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ సలీహా బేగం, అధ్యాపకులు రామయ్య, కిశోర్‌కుమార్ తదితరులు అభినందించారు. వీరికి ఎలాంటి ఫీజు చెల్లించకుండానే ఉచితంగా ఇంజినీరింగ్ పూర్తి చేసే అవకాశం దక్కడంతో కుటుంబీకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


వీఐటీలో సీటు సాధించిన నవీన్


సీటు సాధించిన అమృతను అభినందిస్తున్న దృశ్యం

## ఇంటి వద్దకే వైద్య సేవలు

**అవుకు:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉప్పలపాడు పీహెచ్‌సీ డాక్టర్ వినోద్ కుమార్ సూచించారు. గురువారం మండల పరిధిలోని కొండమనాయునిపల్లె, పిక్కళ్లపల్లి తాండా గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రెండు గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. 70 మంది సాధారణ వ్యాధిగ్రస్తులకు, 18 మంది గర్భిణులు, నలుగురు బాలింతలు, 21 మంది రక్తపోటు బాధితులు, 8 మంది డయాబెటీస్ పేషెంట్లు, బెడ్‌కే పరిమితమైన ఇద్దరు రోగులను పరీక్షించి చికిత్స అందించారు. అలాగే ప్రధాన మంత్రి వైద్య వందన యోజన, జనని సుఖీభవ, జనని శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, డ్రైడే–ఫ్రైడే కార్యక్రమాల గురించి వివరించారు. సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్లు కమాల్‌సాహెబ్, దానమ్మ, సీహెచ్ఓ శ్రీలేఖ, ఆరోగ్య కార్యకర్త జ్యోష్ణ, 104 సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య సేవలందిస్తున్న డాక్టర్ వినోద్‌కుమార్

## పంట కోత ప్రయోగాలపై అవగాహన

**బనగానపల్లెరూరల్:** పంటకోత ప్రయోగాల్లో ఆర్‌బీకేల్లో విధులు నిర్వహించే విలేజ్ అగ్రికల్చర్ ఆఫీసర్, గ్రామ వీఆర్ఓ, హార్టికల్చర్ సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలని డోన్ సబ్ డివిజన్ ఉప గణాంక అధికారి చిదంబరం సూచించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పంటకోత ప్రయోగం ఏ విధంగా చేయాలి, యాప్‌లో ఏవిధంగా నమోదు చేయాలనే అంశాలపై అవగాహన కార్యక్రమం మండల ఏఎస్ఎస్ఓ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. పాల్గొన్న ఉపగణాంక అధికారి చిదంబరం మాట్లాడుతూ.. పంటకోత ప్రయోగం విధానం, ఉపయోగాలను వివరించారు. ఏఓ సుబ్బారెడ్డి మాట్లాడుతూ అగ్రికల్చర్, ఆర్‌బీకే సిబ్బంది మాత్రమే ప్రయోగాల్లో పాల్గొంటున్నారని వీఆర్ఓలు నిర్లక్ష్యంగా ఉంటున్నట్లు పేర్కొన్నారు. రెవెన్యూ సిబ్బంది కూడా తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. ఉద్యానవన శాఖ అధికారి రాఘువరణ్, ఏఈఓ ఓబులేస్ తదితరులు పాల్గొన్నారు.


మొబైల్ యాప్‌లో నమోదు చేసే విధానాన్ని వివరిస్తున్న డోన్ సబ్ డివిజన్ ఉపగణాంక అధికారి చిదంబరం

**అవుకు:** మండల పరిధిలోని వ్యవసాయ, ఉద్యాన శాఖ సిబ్బందికి పంటకోత ప్రయోగాలపై ఏఎస్ఓ భాస్కర్ రెడ్డి గురువారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు పంటనష్టానికి గురైతే ఇన్సూరెన్స్ పొందేందుకు పంటకోత ప్రయోగాలు కీలకం అన్నారు. ప్రతి గ్రామంలో ఎంపికైన సర్వే నంబర్లలో ఎలాంటి తప్పులు లేకుండా ఫారం–1, 2 లను పూర్తి చేయాలని సూచించారు.

### విద్యుత్ తీగలు చోరీ

**సంజామల:** మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో బోరు బావులకు ఏర్పాటుచేసుకున్న విద్యుత్ తీగలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని బాధిత రైతులు గురువారం తెలిపారు. 9 మంది రైతులకు చెందిన రూ.30 వేలు విలువ గల తీగలను అపహరించుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

### పేకాటరాయుళ్ల అరెస్ట్

**సంజామల:** మండల పరిధిలోని రెడ్డిపల్లె గ్రామంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ గురువారం తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ.. రెడ్డిపల్లె గ్రామ శివారులో ఎస్ఆర్‌బీసీ కాల్వ సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేయగా 8 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. 12 మంది జూదగాళ్లు పరారైనట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ.90,310 నగదు స్వాధీనం చేసుకొని అరెస్టు చేశామని, పరారైన వారిని త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

### ఆలయాభివృద్ధికి సహకారం

**కోవెలకుంట్ల:** పట్టణంలోని అంకాలమ్మ చౌరస్తాలో జీర్ణోద్ధరణ గావించిన మారెమ్మ ఆలయ అభివృద్ధికి గురువారం దాతలు సహకారమందించారు. ఆలయం ఎదుట ప్రతిష్ఠించిన మారెమ్మ ప్రతిమకు పట్టణానికి చెందిన వాసగిరి సుధీర్ ఆర్థిక సహకారంతో రూ.12 వేలతో రేకులషెడ్, చాకలి వెంకటరమణ సాహకారంతో దేవాలయంపై రూ. 5 వేలతో కలశం లైట్ ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

### ఓటరు సర్వే వేగవంతం చేయండి


సీతారామాపురంలో ఓటర్ సర్వేను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి

**బేతంచెర్ల:** మండలంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జరుగుతున్న ఓటర్ వెరిఫికేషన్ సర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని సీతారామాపురం గ్రామంలో బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఓటర్ సర్వేను తహసీల్దార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయంలో ఓటర్ సర్వే, నమోదు, తొలగింపులు, సవరణలపై చర్చించారు. సర్వే పకడ్బందీగా చేపట్టాలన్నారు.

### సంక్షేమం, అభివృద్ధిని చూసి ఆదరించండి


తవిసికొండ గ్రామంలో 'మీ ఓటు విలువ - ఒక మార్పు' కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**బేతంచెర్ల:** సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని గమనించి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని వైస్ ఎంపీపీ రంగస్వామి, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు ప్రజలను విజ్ఞప్తి చేశారు. గురువారం మండల పరిధిలోని తవిసికొండ గ్రామంలో 'మీ ఓటు విలువ – ఒక మార్పు', 'రాజకీయం ఓ సామాజిక బాధ్యత' కార్యక్రమాలు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు చింతల నాగిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ..
మండల చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్, మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని వివరించారు. అలాగే మండ్లవానిపల్లెలో గోరుమానుకొండ, యంబాయి గ్రామాల సర్పంచ్‌లు యుగంధర్ రెడ్డి, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పత్ర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**కొలిమిగుండ్ల:** పత్రల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, గౌరవాధ్యక్షులు హనుమంతురాయుడు, నాగేశ్వరనాయుడు కోరారు. గురువారం కొలిమిగుండ్లలోని షిర్డీసాయి ఫంక్షన్ హాల్‌లో జిల్లా పత్ర కులస్తుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహానేత వైఎస్సార్ చలువతో పత్రలకు సమాజంలో గుర్తింపు వచ్చిందన్నారు. బీసీ హోదా రావడంతోనే విద్య, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్ పొందగలుగుతున్నామని చెప్పారు. త్వరలో కులం అభివృద్ధి, వెనుకబాటు తనాన్ని రూపుమాపేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పత్రలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ సెప్టంబర్ 2న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మహేశ్వరయ్య, గౌరవాధ్యక్షులుగా బెలుం పెద్దన్న, రాజయ్య, క్రిష్ణుడు, ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ తదితరులను ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసుల నాయుడు, రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్లా సునీల్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పత్ర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతురాయుడు

## ఉద్యోగ నైపుణ్యం మెరుగునకు శిక్షణ

**డోన్:** సచివాలయ అధికారులకు కంప్యూటర్‌తో పాటు సోషల్ మీడియాపై సంపూర్ణ అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం డిజిటల్ సోషల్ మీడియా అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహిస్తోందని మునిసిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. పట్టణంలోని టీసీఐఎల్ సంస్థ ఆధ్వర్యంలో ఫోటాన్ ఇన్‌స్టిట్యూట్ నందు సచివాలయ ఉద్యోగులు, సిబ్బందికి నాలుగు రోజుల శిక్షణ తరగతులను గురువారం ఆయన ప్రారంభించారు. అంతకుముందు శిక్షణ ముగించుకున్న సచివాలయ అధికారులకు ఆయన సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమానికి ప్రాజెక్టు ఇన్‌చార్జ్ సమరసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సోషల్‌మీడియాపై పూర్తి అవగాహన, జాబ్‌రూల్స్ కమ్యూనికేషన్‌లో ప్రతిభను పెంపొందించేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని కమిషనర్ అన్నారు. శిక్షణ కార్యక్రమంలో నంద్యాల జిల్లావ్యాప్తంగా ఉన్న సచివాలయాల అధికారులు, సిబ్బంది విడతల వారీగా పాల్గొంటున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని ఫోటాన్ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు సాయినాథ్ నిర్వహిస్తున్నారు.


శిక్షణ పొందిన సచివాలయ అధికారికి సర్టిఫికెట్ అందజేస్తున్న కమీషనర్ వెంకట్రామిరెడ్డి

## పోటాపోటీగా నామినేషన్లు


కోవెలకుంట్లలో 6వ వార్డు స్థానానికి నామినేషన్ దాఖలుచేస్తున్న కాల్వ శ్రీవాణి


ఆకుమల్ల గ్రామంలో నామినేషన్ స్వీకరిస్తున్న ఎన్నికల అధికారి సుధాకర్ రెడ్డి

**కోవెలకుంట్ల:** మండలంలోని ఆయా గ్రామాల్లో ఖాళీగా ఉన్న వార్డు స్థానాలకు జరుగుతున్న ఉప ఎన్నికలకు సంబంధించి 14 నామినేషన్లు దాఖలయ్యాయి. మేజర్ గ్రామ పంచాయతీలోని 6వ వార్డు, మండలంలోని సొదరదిన్నె, చిన్నకొప్పెర్ల, కలుగొట్ల గ్రామాల్లోని ఒక్కో వార్డు స్థానాల భర్తీకి ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారి చేసింది. గురువారం నామినేషన్ల స్వీకరణకు ఆఖరు తేదీ కాగా కోవెలకుంట్ల వార్డు స్థానానికి 8, కలుగొట్ల, సొదరదిన్నె, చిన్నకొప్పెర్ల వార్డు స్థానాలకు ఒక్కో వార్డుకు ఇద్దరు చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. ఆయా గ్రామాలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా నరేంద్రనాథ్ శర్మ, హరీష్, వెంకటరామిరెడ్డి, వెంకటసుబ్బయ్య వ్యవహరిస్తున్నారు. 12వ తేదీన నామినేషన్ల పరిశీలన, 14న ఉపసంహరణ, 19న పోలింగ్ అదే రోజున ఓట్ల లెక్కింపు ఉంటుందని ఆర్ఓలు వెల్లడించారు.

**బనగానపల్లె:** మండలంలో ఖాళీగా ఉన్న మూడు వార్డు స్థానాలకు నాలుగు నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు. నందివర్గం 1వ వార్డుకు రెండు, అప్పలాపురం 10వ వార్డు, రామక్రిష్టాపురం 2వ వార్డుకు ఒక్కో నామినేషన్లు దాఖలైనట్లు చెప్పారు. నేడు పరిశీలన కార్యక్రమం అనంతరం అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు.

**సంజామల:** మండల పరిధిలోని ఆకుమల్ల, ఆల్వకొండ, పేరుసోముల గ్రామాలలో జరిగే వార్డు స్థానాల ఉప ఎన్నికకు నామినేషన్ ప్రక్రియ గురువారం ముగిసింది. ఆయా స్థానాలకు 8 నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారులు తెలిపారు. ఆకుమల్ల 10వ వార్డు స్థానానికి మాలె స్వరూప, శ్రీరాముల నిర్మల జ్యోతి, నూలి స్వరూప, శ్రీరాముల లత ఆల్వకొండ ఒక్కటవ వార్డు స్థానానికి శ్రీనివాసులు, మురళీ గౌడు, ప్రసాదు పేరుసోముల 2వ వార్డు స్థానానికి బి.సునీత నామినేషన్ వేశారన్నారు.

**కొలిమిగుండ్ల:** మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో వివిధ కారణాలతో ఖాళీ ఏర్పడిన స్థానాలకు నిర్వహిస్తున్న ఉప ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ గురువారంతో ముగిసిందని ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. కనకాద్రిపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానానికి చివరి రోజు నలుగురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. బెలుం నాల్గవ వార్డుకు ఒకరు, అంకిరెడ్డిపల్లె ఒకటవ వార్డు స్థానానికి ఒకరు చొప్పున నామినేషన్ వేశారు. కనకాద్రిపల్లె సర్పంచ్‌కు మొత్తం తొమ్మిది మంది, బెలుం వార్డుకు ఇద్దరు, అంకిరెడ్డిపల్లె వార్డు స్థానానికి ఇద్దరు చొప్పున అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లు ఆయన తెలిపారు.

**వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం**

**ప్యాపిలి:** మండల పరిధిలోని అలేబాదు, మాధవరం వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం కానుంది. వార్డు సభ్యుడి ఎన్నికకు గ్రామస్తులంతా రాజకీయాలకు అతీతంగా ఏకతాటిపై నిలిచారు. ఆయా గ్రామాల్లోని ఇరు వర్గాలు ఉమ్మడిగా ఒకే అభ్యర్థికి మద్దతు తెలిపారు. అలేబాదు వార్డు సభ్యుడు పాలమద్దయ్య అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో అతని కుమారుడు శివరాముడు నామినేషన్ వేశారు. గ్రామ పెద్దలు పరమేశ్, బాలయ్య తదితరులు రాజకీయాలకు అతీతంగా వార్డు సభ్యుడి ఎన్నికను ఏకగ్రీవం చేసుకునే విధంగా మాట్లాడుకున్నారు. అలాగే మాధవరంలో ఒకటో వార్డు సభ్యుడు బాలమద్దయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో అతని కుమార్తె కృష్ణవేణి వార్డు సభ్యురాలిగా నామినేషన్ వేశారు. మాధవరంలో కూడా గ్రామ పెద్దలు మాధవరం స్వామి, శంకర్‌రెడ్డి, బాలవెంకటేశ్, శ్రీరాములు రాజకీయాలకు అతీతంగా కృష్ణవేణిని బలపర్చారు. దీంతో ఈ రెండు వార్డుల్లో ఒక్కో నామినేషన్ చొప్పున దాఖలైంది. ఈ రెండు వార్డులు ఏకగ్రీవమైనట్లు అధికారులు ప్రకటించాల్సి ఉంది.